క్లుప్తంగా

మొక్కలు సంరక్షించాలి



పాన్‌గల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తెల్ల రాళ్లపల్లితండాను సందర్శించి సర్పంచ్ శాంత మ్మతో కలిసి మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీడ కోసం నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం తండాలో ఎస్‌డీఎఫ్ ద్వారా నిర్మించిన డ్రైయినేజీలు, సీసీ రోడ్లు, ఉపాధి కూలీల కోసం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, బాల్యానాయక్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వీరాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను శుక్రవారం రాష్ట్ర కో ఆర్డినేటర్ టీం సభ్యులు సాద్వీ నాయక్, ఎంపీఓ జయశంకర్, డిప్యూటీ ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును చూసి వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమం తీసుకొచ్చారని, పనులను నాణ్యవంతంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లారెడ్డి, విద్యాశాఖ ఏఈ కవిరెడ్డి తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులకు చెత్త బుట్టల పంపిణీ

కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన నాయీ బ్రాహ్మణులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొగాకు సుఖేశిని శుక్రవారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల్లో చెత్తతో పాటు, వెంట్రుకలను వేసుకోవడానికి ఈ బుట్టలను వినియోగించు వాలని ఆమె సూచించారు. తడి, పొడి చెత్తలను విడివిడిగా వేరు చేయాలన్నారు. అదేవిధంగా నాయీబ్రాహ్మణుల దిన అవసరాల నిమిత్తం షెడ్డు నిర్మాణం కోసం రూ. 4 లక్షలు కేటాయించామని, దీంతో పాటు మరో రూ. 2 లక్షలు మంజూరు చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామస్వామి, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయండి

అమరచింత: మండల కేంద్రంలో వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతి పత్రం అందించారు. మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ కళాశాల మంజూరు కాకపోవడం దారుణమన్నారు. ప్రతి ఏడాది మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు పదోతరగతి అనంతరం ఇంటర్ విద్యకోసం ఆత్మకూర్, వనపర్తి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, శ్యాం పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయపద్రం చేయండి

వనపర్తి: మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడే ఒక చారిత్రాత్మక దినమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు భవిష్యత్ లేకుండా చేస్తోందని విమర్శించారు. కరోనా తర్వాత అనేకమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బార్, కార్యవర్గసభ్యుడు పుట్టా ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు' శిబిరం ప్రారంభం

చిన్నంబావి: కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రంజిత్‌కుమార్, ఎంపీటీసీ పుష్పావతి, ఎంపీడీఓ రవి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి కంటి సమస్యలు ఉన్నా శిబిరంలో పరీక్షలు చేయించుకుంటే వాటికి మందులు, అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్లు ఉచితంగా ప్రభుత్వం నుంచి అందుతాయన్నారు. దీన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమవర్ధన్, క్యాంప్ సూపర్‌వైజర్ శశికళ, హెల్త్ డిపార్ట్‌మెంట్ జహంగీర్, డాక్టర్ లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పాన్‌గల్: ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగించకుండా కాంటా చేయాలని తహసీల్దార్ చక్రపాణి అన్నారు. శుక్రవారం మండలంలోని బండపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి ధాన్యం సేకరణపై ఆరా తీశారు. తేమ పేరుతో ధాన్యం సేకరణలో జాప్యం చేయవద్దన్నారు. దీంతో పాటు కేంద్రాల్లో నీడ కోసం టెంట్, నీటి వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, వీఆర్ఏ సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే..

రైతుల మేలు కోసమే ప్రభుత్వ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ విష్ణువర్ధర్‌రెడ్డి అన్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో మండలంలోని బహదూర్‌గూడెం, బండపల్లి, జమ్మాపూర్, కదిరెపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని అక్కడే తమ ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యంను కాంటా చేయాలని సిబ్బందికి సూచించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మండలంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యంతో రైతులు ఆందోళన చెందొద్దని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, సర్పంచ్‌లు విష్ణునాయుడు, రాజేశ్వరమ్మ, చెన్నమ్మ, లక్ష్మయ్య, ఎంపీటీసీలు ప్రేమ్‌కుమార్, నాగమ్మ, విండో డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



జూరాలలో వరిధాన్యం పరిశీలిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

అమరచింత: అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జూరాల, గుంటిపల్లి గ్రామాల రహదారులపై నూర్పిళ్లకు వరి కుప్పలు వేయగా వాటిని పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు ఎప్పుడు కురుస్తాయే అన్న ఆందోళన రైతుల్లో నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే వరి కొనుగోళ్ల పక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలో పనిచేయని కాంటా



గోపాల్‌పేట: బుద్దారంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి పనిచేసిన కాంటా సాయంత్రం అయ్యేసరికి తూకంలో తేడా చూపించిందని రైతులు తెలిపారు. 40 కిలోలు చూపాల్సిన కాంట 43 కిలోలు చూపింది. మరోసారి అదే సంచి కిందకి దించి మళ్లీ వెంటనే కాంటాపై పెడితే 60 కిలోలకు పైగా చూపింది. దీంతో హమాలీలు వెంటనే కొనుగోళ్లను నిలిపివేశారు. ఒకవైపు వాతావరణంలో మార్పుల కారణంగా వర్షం కురిసే అవకాశం ఉండడం.. మరోవైపు కాంటా పనిచేయక తూకాల్లో జాప్యం జరుగుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని కొనుగోళ్లు తొందరగా పూర్తి అయ్యేలా చూడాలని రైతులు కోరారు.

పెండింగ్ కూలి వెంటనే చెల్లించాలి

పాన్‌గల్: ఉపాధి పనులు చేసిన కూలీలకు సంబంధించిన పెండింగ్ కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 వారాల నుంచి పనిచేస్తున్నా డబ్బులు తమ ఖాతాల్లో జమకాలేదని, వేసవి కాలం దృష్ట్యా పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నీటి వసతి, నీడ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి అందుబాటులో లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీలకు పెండింగ్ డబ్బులు, పనుల వద్ద వసతులు ఏర్పాటు చేయాలని, లేనిచో కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సాయన్న, రాఘవేంద్ర, వెంకటేష్, రంగాస్వామి, వీరన్న, నర్సమ్మ, రంజిత్‌కుమార్, హేమనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

వనపర్తి టౌన్: నల్గొండ జిల్లాలో ఈనెల 26న జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం నుంచి సస్పెండ్ అయిన ప్రతాప్‌రెడ్డిని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు చెన్నరాములు, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రతినిధులు హేమలత, శ్రీనివాస్‌రెడ్డి, పల్లా శ్రీనివాసులు, నాగరాజు తదితరులు ప్రతాప్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి

కొత్తకోట: దళితబంధు విషయంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడినట్లు స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పడం హర్షించదగ్గ విషయని, వెంటనే ఆ ఎమ్మెల్యేపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాసురెడ్డి డిమాండ్ చేశారు. కొత్తకోటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తన వద్ద ఉన్న అవినీతి ఎమ్మెల్యేల చిట్టా వెంటనే బయట పెట్టాలని కోరారు. స్వయాన ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలపై బహిరంగంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, దళితబంధు ఇవ్వడంలో ఒక్కొక్కరి నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం ఆశ్చర్యకరమని చెప్పారు. తన సొంత పార్టీ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్న విషయం తెలిసినా.. ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు రూ.వందల కోట్లు వెనకేసుకున్నారని, మళ్లీ మూడోసారి అధికారం వస్తే రూ.వేల కోట్ల తెలంగాణ సంపద కనుమరుగు కావడం ఖాయమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్థిక అంశాలపైనే ఆసక్తి

వనపర్తి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆర్థిక పరమైన అంశాలపై మక్కువ చూపుతున్నారు తప్పితే ప్రజా, తాగునీటి సమస్యపై ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తనకు అధికారులు సమాచారం ఇవ్వలేదని, తాను పుర కార్యాలయంలోని తన చాంబర్‌లోనే కూర్చున్నట్లు శుక్రవారం రాత్రి సాక్షికి తెలిపారు. రూ. 33 కోట్లతో మిషన్ భగీరథ పనులు జరుగుతుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని, భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొనే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వేసవికి ముందు తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అవగాహనకు రావాల్సి ఉందని, నాలుగు నెలలుగా మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తిని అగ్రగామిగా నిలిపేందుకు ప్రయత్నిస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో పుర ప్రజల ఆశలు ఆవిరి అవుతున్నాయన్నారు.

సారా పట్టివేత

కొత్తకోట: మండలంలోని ఈదులబావితండాలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా దాడులు జరిపి సారాను పట్టుకున్నట్లు కొత్తకోట ఎక్సైజ్ సీఐ ఓంకార్ తెలిపారు. దాడుల్లో 3 లీటర్ల సారా, 3,930 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పట్టిక, ఒక మహీంద్ర వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు అంగోతు మణి, గుంత చిన్ననాగిశెట్టి, మద పర్వత రాజుపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, శివకుమార్, బీరయ్య పాల్గొన్నారు.



ఈదులబావితండాలో పట్టుబడిన నిందితులు

తహసీల్దార్ ఎదుట బైండోవర్

పాన్‌గల్: సారా విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలను ఎక్సైజ్ సిబ్బంది తహసీల్దార్ చక్రపాణి ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. మండలంలోని గురిగింజమిట్టతండాకు చెందిన మంగమ్మ, భాగ్యమ్మ అనే ఇద్దరు మహిళల వద్ద ఒక్కొక్కరి వద్ద రెండు లీటర్ల చొప్పున సారా లభించింది. ప్రభుత్వం సారాను నిషేధించిందని, సారా విక్రయాలు మానుకోవాలని తహసీల్దార్ మహిళలకు సూచించారు. మరోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా లేదా జైలు శిక్ష ఉంటుందనే విషయాన్ని మహిళలు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పీసీ రాజు పాల్గొన్నారు.



పాన్‌గల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయిన సారా విక్రేతలు

సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన రాజు, రమేష్ ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎస్ఐ శ్రీహరి సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్లు ఎక్కడున్నది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూ.1.28 లక్షల విలువ గల వన్‌ప్లస్ సెల్‌ఫోన్లను శుక్రవారం ఫిర్యాదుదారులకు అప్పగించారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

కొత్తకోట రూరల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు అవసరమైన మొక్కలు గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామం పచ్చగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ప్రారంభించింది. అందులో భాగంగా మండలంలోని 22గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో గ్రామస్తులను మొక్కల పెంపకంపై సమాయత్తం చేశారు. ఒక్కో నర్సరీలో పదివేల మొక్కలు పెంచేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచడానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ముందస్తు చర్యలు

ఎరువులు, ఎర్రమట్టితో మొక్కలను పెంచడానికి నర్సరీలు సిద్ధం చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుకూలంగా పూల మొక్కలు టికోమో, గన్నేరు, బోగన్‌విలియా, పండ్ల మొక్కలు జామ, దానిమ్మ, బాదం, నిమ్మ, మునగ, బొప్పాయి, కరివేపాకు మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు గులుమోహర్, సీమతంగేడీ, రేయిన్‌ట్రీ, చింత, వేప వంటి తదితర మొక్కలను పెంచుతున్నారు. మండలంలో సుమారు 1.80లక్షల మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కూలీలకు ఉపాధి..

వేసవిలో పనులు దొరకక రోజువారి కూలీల జీవనోపాధి కష్టతరంగా మారుతున్న నేపథ్యంలో నర్సరీల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లోని కూలీలకు ఉపాధి లభించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీలో మొక్కలు సిద్ధం చేసే క్రమంలో ఒక్కో నర్సరీలో రోజు కనీసం 10మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. వారికి ఉపాధి హామీ పథకం ద్వారా వారం లేదా 15రోజులకు ఒకసారి కూలీ డబ్బులు చెల్లించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు, సర్పంచ్‌లు, ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



జగత్‌పల్లి నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్ (ఫైల్)

ఉపయోగపడే మొక్కలు

ఈ ఏడాది హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అనుకున్న లక్ష్యం మేరకు మండలంలోని 22గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. దీనికోసం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ నర్సరీలతో పలువురికి ఉపాధి లభిస్తుంది. నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలను సిద్ధం చేశాం. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండుసార్లు నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించాం.

– అఫ్జల్, ఎంపీడీఓ, పెద్దమందడి

భూఅక్రమాలపై స్పందించరేం?

- మున్సిపల్ కమిషనర్‌తో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం
- శ్వేత పత్రం ఇస్తామని తప్పించుకుంటున్నారని ఆగ్రహం
- సమాచారం ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

అమరచింత: ఆత్మకూర్ మున్సిపాలిటీలోని వెంచర్లలో పది శాతం వాటా భూములపై మున్సిపాలిటీ ఎందుకు పట్టించుకోవడం లేదంటూ కమిషనర్ రమేష్‌తో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాగ్వాదానికి దిగారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు నాయకులు కలిసి పట్టణంలో జరుగుతున్న భూకబ్జాల గురించి కమిషనర్‌ను ప్రశ్నించారు. అక్రమ లేఅవుట్ల పేరిట భూదందా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వెంచర్లలో మున్సిపాలిటీకి దక్కాల్సిన పది శాతం భూములను సైతం అక్రమార్కులు కాజేస్తున్నారని, దీనికి మున్సిపల్ అధికారులు అండదండలు ఉన్నాయని ఆరోపించారు. దేవాలయం భూములతో పాటు ఆయా వెంచర్లలో మున్సిపాలిటీకి చెందాల్సిన ప్లాట్లను కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వెంకటేశ్వర కాలనీలో..

పట్టణంలోని వెంకటేశ్వరకాలనీతో పాటు సమీపంలోని మరో వెంచర్‌లో ఉన్న భూములను సైతం ఇతరులను బినామీగా పెట్టి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని ప్రశాంత్‌రెడ్డి కమిషనర్‌తో వాదించారు. వారం రోజుల కిందట ఇచ్చిన వినతి పత్రానికి పూర్తిగా వివరాలను కాగితం రూపంలో ఇచ్చానని, వీటిని కాదని మరోమారు అంతా అవినీతి జరిగిందని ఆరోపించడం కేవలం రాజకీయ లబ్ధికోసమే అని కమిషనర్ తెలిపారు. ఇచ్చిన వివరణలకు సంతృప్తి పడకుంటే మరోమారు సరైన వివరాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, మండల అధ్యక్షుడు పరమేష్, జబ్బార్, మధు, షబ్బీర్, చెన్నయ్య ఉన్నారు.



ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కౌన్సిలర్ల వాగ్వాదం

మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను కలిసి సమస్యలపై శ్వేతపత్రం ఇవ్వమని అడగడానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకోంది. వాగ్వాదం అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కమిషనర్‌కు కలిసి సమస్యలపై చర్చించారు.

సాక్షి కథనంపై ప్రజల్లో చర్చ

ఆత్మకూర్ పట్టణంలోని వెంచర్లలో అక్రమంగా ప్లాట్లను అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారని, ఇందులో మున్సిపాలిటీ పట్టిపట్టనట్టుగా వ్యవహరిస్తుందని సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితం అయిన స్థలాలకు టెన్‌డర్ అనే కథనంపై పట్టణ ప్రజలు విస్తృతంగా చర్చిస్తున్నారు. ఆత్మకూర్‌లో ఇలాంటివి జరుగుతున్నాయని ఇప్పటికైనా తెలిసిందని చెప్పుకుంటున్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో రెండో విడత గొర్రెల పంపిణీపై లబ్ధిదారులకు శుక్రవారం మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై అందించే గొర్రెలకు లబ్ధిదారుడు రూ.43,500 చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి 20 గొర్రెలు, ఒక పొట్టేలును ప్రభుత్వం ఇస్తుందన్నారు. లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా నుంచి నేరుగా డబ్బులను కలెక్టర్ ఖాతాకు జమ చేయాలని సూచించారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, కులం ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను సంఘం అధ్యక్షులకు గానీ, మండల పశు వైద్యశాలల్లో అందించాలని కోరారు.

అర్హులందరికీ గొర్రెలు

ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై అందించే గొర్రెలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని జిల్లా గొర్రెల కాపారుల సంఘం చైర్మన్ కురుమూర్తియాదవ్ అన్నారు. ఎట్టి పరిస్థితులల్లో దళారులను నమ్మొద్దని ఆయన లబ్ధిదారులకు సూచించారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి కూడా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సబ్సిడీపై రుణాలు అందిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో గొర్రెల కాపారుల సంఘం జిల్లా డైరెక్టర్ తిరుమల్‌యాదవ్, సర్పంచ్ మంజుల, రాముయాదవ్, చంద్రమల్లయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశువైద్యాధికారి డా.శ్యామ్

వాల్‌పోస్టర్లు విడుదల

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్స్‌లో మే 7న జరిగే భారీ బహిరంగ సభకు బహుజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగనమోని చెన్నరాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీఎస్పీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షుడు గణపురం కృష్ణ మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీలో చేరిన తర్వాత మొట్టమొదటి సారి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి తెలంగాణ బహిరంగ సభకు హాజరుకానున్నారని, మహిళలు, యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె మహేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దం మహేష్, జిల్లా కార్యదర్శులు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బిల్లుల చెల్లింపులో జాప్యంపై నిరసన

వీపనగండ్ల: గ్రామాల్లో తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఎన్నో నెలలుగా రావడం లేదని, అందుకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని సర్పంచ్‌లందరూ మూకుమ్మడిగా బహిష్కరించారు. ఏళ్ల తరబడి అప్పులు చేసి పనులు చేశామని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోగా మరికొన్ని నిధులకు ఫ్రీజింగ్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

జెడ్పీ చైర్మన్ నచ్చచెప్పినా..

ఎంపీపీ కమలేశ్వర్‌రావు అధ్యక్షతన ప్రారంభమైన మండల సర్వసభ్య సమావేశంలో కొద్దిసేపటికే నిరసన తెలియజేస్తూ బయటకు వెళ్లేందుకు ఉపక్రమించిన సర్పంచ్‌లకు సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేయాలని సూచించారు. అభివృద్ధి పనులపై సమీక్ష జరుపుదామని సర్పంచ్‌లకు నచ్చచెప్పినా వినకుండా సమావేశాన్ని సర్పంచ్‌లు బహిష్కరించారు. బహిష్కరించిన వారిలో సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, మౌలాలి, అంజయ్యనాయ్, రామేశ్వర్‌రావు, సుజాత, పద్మ ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, వీఏఓల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి ప్రదర్శించడం తగదని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పరంగా మద్దతు ఉంటుందని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు కె.ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద శుక్రవారం ఐకేపీ వీఓల నిరవదిక సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. రాజయ్యగౌడు, శ్రీనివాసులు, భాగ్యమ్మ, స్వరూపరాణి, బాలరాజు, శేషయ్య, నరేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో వీఓఏల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు పాల్గొన్నారు.

మదనాపురం: ఐకేపీ వీఓఏలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ మండల కేంద్రంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవదిక సమ్మెకు టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పగిడాల శ్రీనివాస్ శుక్రవారం సంఘీభావం తెలిపారు.